క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన


ఆపరేషన్లకు ఎంపికైన వారితో నిర్వాహకులు

బైరెడ్డిపల్లె: స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం మహతి ఫౌండేషన్ సహకారంతో పీఈఎస్ ఆసుపత్రి వైద్యాధికారులు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరంలో 74 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి 9 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ప్రతి నెలా నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు వచ్చి సద్వినియోగం చేసుకుంటున్నారని, అధునాతన పరిజ్ఞానంతో ఆపరేషన్లు చేస్తున్నట్టు పీఈఎస్ వైద్యాధికారులు తెలిపారు. శిబిరంలో మహతి ఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఐడల్ టీచర్ల అసోసియేషన్ కార్యవర్గం ఎంపిక


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఐడల్ అసోసియేషన నూతన కార్యవర్గం

పుంగనూరు: పట్టణంలోని కొత్తయిండ్లు వద్ద ఓ ప్రైవేటు పాఠశాలలో ఐడల్ ఉపాధ్యాయ సంఘ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఆదివారం జిల్లా ఐడల్ అసోసియేషన్ సభ్యులు సమావేశమయ్యారు. అసోసియేషన్ అధ్యక్షుడుగా సాబ్జుసాహెబ్, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ అలీమ్, ఉపాధ్యక్షులుగా అక్బర్ హుస్సేన్, గౌస్‌బాషా, నసీమ్‌బాషా, జహీర్ అబ్బాస్, మీడియా కార్యదర్శిగా రబ్బాని, కోశాధికారిగా ముబారక్‌బాషా, మహిళా కార్యదర్శిగా అక్తర్‌బేగం, గౌరవాధ్యక్షులుగా రహంతుల్లాను ఎన్నుకున్నారు. అనంతరం నూతన సంవత్సరం క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది.

స్వయం సేవక్ సమ్మేళనానికి వెళ్లారు

పుంగనూరు: చిత్తూరులో ఆదివారం నిర్వహించిన రాష్ట్రీయ స్వయంసేవక్ సమ్మేళనానికి పట్టణ బీజేపీ అధ్యక్షుడు జగదీష్ ఆధ్వర్యంలో పలువురు వెళ్లారు. చిత్తూరులో పలు దేశభక్తి అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు వారు తెలిపారు.

విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూస్తాం

గుడిపాల: విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూస్తామని ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ అన్నారు. ఆయన ఆదివారం కొత్తపల్లె, సీకే పల్లె సబ్‌స్టేషన్‌లను ఆయన పరిశీలించారు. ఎస్‌ఈ మాట్లాడుతూ చిత్తూరు–తచ్చూరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా 132 కేవీ లైన్ మార్పులు జరుగుతున్నందున గుడిపాల మండలానికి ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 197 రామాపురం సబ్‌స్టేషన్‌కు బీఎస్‌ఆర్‌పేట నుంచి, రెడ్డిగుంట, తుమ్మిందపాళ్యం సబ్‌స్టేషన్ నుంచి 189 కొత్తపల్లె సబ్‌స్టేషన్‌కు విద్యుత్‌ను అందజేస్తామన్నారు.

ధాం.. ధాం..!

పలమనేరు ప్రాంతంలోని అటవీ సమీప గ్రామాల్లో అంగట్లో సరుకులు దొరికినంత సులభంగా నాటు తుపాకులు లభ్యమవుతున్నాయి. ఇక్కడి కౌండిన్య అడవిలో నాటు తుపాకుల మోత ఈ ప్రాంతానికి కొత్తేమీ కాదు. ఇన్నాళ్లు గోప్యంగా ఉన్న వేటగాళ్లు ఇప్పుడు కూటమి ప్రభుత్వ రాకతో పచ్చ కండువాలు కప్పుకుంటున్నారు. మాదే ప్రభుత్వం ..ఎవరూ ఏం చేయలేరనే ధీమాతో దర్జాగా వన్యప్రాణులను వేటాడుతున్నారు. వీరి ధాటికి కొన్ని సార్లు పశువులు, మేకల కాపరులు బలైన ఉదంతాలూ సైతం లేకపోలేదు.

- నాటు తుపాకులకు కేరాఫ్ పలమనేరు!
- వన్యప్రాణుల వేటకోసం ఉంచుకున్న వేటగాళ్లు
- తమిళనాడు నుంచి గుట్టుగా తూటాలు, రవ్వలు సరఫరా
- కూటమి రాకతో పెట్రేగుతున్న వేటగాళ్లు
- ఇటీవలే దొడ్డిపల్లెలో నాటు తుపాకుల కలకలం


గతంలో పలమనేరు పోలీసులు సీజ్ చేసిన నాటు తుపాకులు (ఫైల్)

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో నాటు తుపాకుల సంఖ్య పెరిగిపోతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. వన్యప్రాణుల వేటకు, ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల దొడ్డిపల్లెలో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుడి వద్ద నాటు తుపాకీ సీజ్ చేసిన పోలీసులు టీడీపీ కార్యకర్త వద్దనున్న తుపాకీ జోలికి మాత్రం పోలేదు. ఇదే గ్రామంలో పదికి పైగా నాటు తుపాకులున్నాయంటే ఇక పలమనేరు ఫారెస్ట్ రేంజి పరిధిలో ఏ స్థాయిలో తుపాకులుంటాయనేది ఇప్పుడు పోలీసులు, ఫారెస్ట్ అధికారులకు తలనొప్పిగా మారింది. సాధారణ ఎన్నికల సమయంలో నాటు తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకుంటున్నా మళ్లీ నాటు తుపాకులు ఎలా పుట్టుకొస్తున్నాయనే విషయం ఇప్పుడు పోలీసులకు ఆందోళన కలిగిస్తోంది.

వేల నాటు తుపాకులు..?

స్థానిక రేంజి పరిధిలో దాదాపు 80 గ్రామాలు కౌండిన్య అడవికి సమీపంలో ఉన్నాయి. కొన్ని దశాబ్దాలుగా అడవుల్లో వన్యప్రాణుల వేట ఇక్కడ సాగుతోంది. దీంతో అడవిలో వేటకోసం కొందరు నాటు తుపాకులను రహస్యంగా ఉంచుకున్నారు. మరికొందరు అడవులకు దగ్గరగా పొలాల వద్ద కాపురాలుంటున్న వారు రక్షణ కోసం నాటు తుపాకులను ఉంచుకుంటున్నారు. దీనికితోడు ఎవరింట్లో నాటు తుపాకి ఉంటుందో వారికి గ్రామంలో ప్రత్యేక మర్యాద కూడా! వారిపైకి ఎవరైనా గొడవలకు వెళ్లాలన్నా భయమే. ఇంతవరకు వన్యప్రాణుల వేటకు మాత్రమే ఉపయోగిస్తున్న తుపాకులు కాస్తా పల్లెల్లోకి చేరాయి. గొడవలు, దౌర్జన్యాలకు వీటిని ఉపయోగించడం, తుపాకీని చూపి భయపెట్టడం ఇప్పుడు ఫ్యాషన్‌గా మారింది.

స్పెషల్ డ్రైవ్‌లలో తుపాకులను సీజ్ చేస్తున్నను..

ఎన్నికల సమయంలో స్పెషల్ డ్రైవ్ పేరిట పలమనేరు పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో వెయ్యికి పైగా నాటు తుపాకులను గత ఎన్నికల సందర్భంగా ఇక్కడి పోలీసులు సీజ్ చేశారు. కానీ ఇప్పుడు నాటు తుపాకులు ఎక్కడనుంచి వస్తున్నాయే పోలీసులకు అర్థం కావడం లేదు. అడవుల్లో నాటు తుపాకుల మోత మోగుతున్నా అటవీశాఖ మాత్రం కిమ్మనకుండా ఉంటోంది. ఇలా అటవీశాఖ సిబ్బంది నాటు తుపాకుల విషయంలో నిర్లక్ష్యం వహించడం వేటగాళ్లకు వరంలా మారింది. ఇప్పటికైనా అటు పోలీస్, ఇటు అటవీ ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి నాటు తుపాకుల కట్టడికి పటిష్ట చర్యలు తీసుకోవడంతోపాటు వన్యప్రాణుల సంరక్షణకూ కృషి చేయాల్సిన అవసరం ఉంటోంది.


వన్యప్రాణుల వేటకు తయారు చేసుకున్న నాటు తుపాకులు

ఇప్పటికే ఎన్నో ఘటనలు

- గతంలో బైరెడ్డిపల్లె మండలం మొగిలి పాదరేవులకు చెందిన వ్యక్తి ఓ మహిళను నాటు తుపాకీతో హతమార్చి పోలీసులకు లొంగిపోయాడు.
- పలమనేరు మండలం ఎర్రగొండేపల్లెకు చెందిన వ్యక్తి అడవిలో నాటు తుపాకీ కాల్పులకు బలయ్యాడు.
- గత ఏడాది కొలమాసనపల్లె బీట్‌లో ఫారెస్ట్ సిబ్బందిపై వేటగాళ్లు కత్తులతో దాడిచేశారు.
- గతంలో పెద్దపంజాణి మండలంలో మరో వేటగాడు అడవిలో మృతి చెందాడు.
- పలమనేరు మండలం దిగువమారుమూరుకు చెందిన చిరంజీవి గతంలో వేటగాళ్ల నాటుతుపాకీ తూటాకు బలయ్యాడు.
- రెండేళ్ల క్రితం గంగవరం మండలం కలిమిచెట్ల పెంట వద్ద అడవిలో నాటుతుపాకీని సరిచేస్తూ ఓ యువకుడు మిస్ ఫైర్ అవడంతో మృతి చెందాడు.
- గతేడాది బైరెడ్డిపల్లె మండలం కడపనత్తంలో చాంద్‌బాషా అనే యువకుడు ప్రేమ విషయంగా నాటుతుపాకీతో గ్రామంలోనే కాల్పులు జరిపి వీరంగం సృష్టించాడు. ఈ తుపాకులను తయారు చేసేవాళ్లలో ఇక్కడి వేటగాళ్లు సిద్ధహస్తులు. వేటలో ఎక్కువ అనుభవమున్న వారితో నాటు తుపాకులను కొత్త వేటగాళ్లు తయారు చేసుకుంన్నారు. వీటికి కావాల్సిన నల్లమందు, గుండ్లు, తూటా, రవ్వలను రహస్యంగా సరఫరా చేసే తమిళనాడు గ్యాంగ్ అందిస్తోంది. ఫోన్ చేస్తే చాలు గుడియాత్తం నుంచి మందు, గుండు కావాల్సిన చోటికి చేరుతోంది. దీంతో ఈ ప్రాంతంలో నాటు తుపాకులకు కొదవ లేకుండా పోయింది.

ఘనంగా ఆలయ జీర్ణోద్ధరణ


పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే

వి.కోట: మండలంలోని గోనుమాకులపల్లెలో ఆదివారం శ్రీ కాళహస్తీశ్వరస్వామి దేవాలయంలో జీర్ణోద్ధరణ, పునఃప్రతిష్ట, కుంభాభిషేకం, పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. హాజరైన మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడను గ్రామస్తులు, ఆలయ నిర్వాహకులు సత్కరించి ప్రత్యేక పూజలు చేయించారు. వేద పండితులు ఆశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజ్, వైస్ ఎంపీపీ తమీమ్, నాయకులు బాలాజీ, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

వి.కోట: పట్టణంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఈనెల 6వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలో విద్యుత్ దీపాలతో స్వామివారి ప్రతిరూపాలు, ఆలయం చుట్టూ విద్యుత్ కాంతులతో సరికొత్త సొబగులు దిద్దారు. 6న ఉదయం గురువారం అంకురార్పణ, ధ్వజారోహణంతో ఉత్సవాలు మొదలవుతాయి. అదేరోజు రాత్రి హంసవాహన సేవ, 7న ఉదయం స్వామి వారి ఉత్సవం, రాత్రి సింహవాహన సేవ, 8న ఉత్సవం, రాత్రి హనుమంత వాహన సేవ, 9న శేష వాహనం, 10న ఉదయం కాశీయాత్ర, సాయంత్రం 4 గంటలకు కళ్యాణోత్సవం, రాత్రి గరుడోత్సవం, 11న రాత్రి గజ వాహనం, 12న రథోత్సవం, రాత్రి దూళి ఉత్సవం, 13న దోపోత్సవం, 14న ఉదయం వసంతోత్సవం, రాత్రి చిత్రగోపురం, శయనోత్సవం, 15న ద్వాదశి హారతులు, రాత్రి శాంతి ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి


వివిధ రంగాల్లో సేవలందించిన వారిని సన్మానించిన సభ్యులు

పలమనేరు: సేవా కార్యక్రమాలతోనే ఎనలేని సంతృప్తి కలుగుతుందని పలమనేరు పరిరక్షణ సమితి అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రమణ్యం పిళ్లై, నరసింహులులు తెలిపారు. పట్టణంలోని ఏపీ ఎన్జీవో కార్యాలయంలో ఆదివారం పలమనేరు పరిరక్షణ సమితి ఏడో వార్షికోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ, పట్టణ సమస్యలపై పీపీఎస్ పోరాటాలు చేసిందని, ఇకపై కూడా చేస్తుందని స్పష్టం చేశారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మాట్లాడారు. ఉపాధ్యక్షుడు టీఎల్ నరసింహులు తాము అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించిన సమస్యలను తెలియజేశారు. వివిధ రంగాలో ఉత్తమ సేవలందిస్తున్న వల్లూరి సరిత, డాక్టర్ రజని, విజయకుమార్, దేవేంద్ర, బాలాజి, రిషబ్ ఓస్వాల్, విజయ కుమార్, నాగప్పను సేవా పురస్కారాలతో సత్కరించారు. సంఘ సేవకులు సీతారామయ్య, ఏపీ ఎన్జీవో నాయకులు ఆనందబాబు, హరి, ఆకుల గజేంద్ర, సత్యప్రకాష్, జీలు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఏపీకి మొండిచెయ్యే!

- సీపీఎం నాయకుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

పలమనేరు: కేంద్ర బడ్జెట్ కేటాయింపులో ఆంధ్రప్రదేశ్‌కు మొండిచేయి చూపారని స్థానిక సీపీఎం నాయకులు తమ పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి గిరిధర్ గుప్త మాట్లాడుతూ, యువత కోసం రాష్ట్రానికి ఓ ప్రాజెక్టు కూడా రాలేదని, రాష్ట్ర విభజన హామీలపై బడ్జెట్‌లో ప్రస్తావనే లేదని, అంతేకాకుండా రైతాంగం సంక్షేమానికి ఎలాంటి మేలూ చేయలేదని విమర్శించారు. కూటమిలో భాగస్వామిగా బీజేపీపై దూకుడు సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రదర్శించడం లేదని, కేవలం ఈ బడ్జెట్ మధ్యతరగతి కొనుగోళ్లను పెంచి తద్వారా పన్నులతో ఖజానా నింపుకునేలా ఉందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో రాజా, జయంతి, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయపు పన్ను స్లాబ్‌లో పెద్ద ట్విస్ట్


సోమచంద్రారెడ్డి

పలమనేరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వేతన జీవుల ఆదాయపు పన్ను స్లాబ్‌లో పెద్ద ట్విస్ట్ ఉందని నియోజకవర్గ పింఛనర్ల సంఘనేత సోమచంద్రారెడ్డి ఆరోపించారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉద్యోగుల ఆదాయం రూ.12.75 లక్షలకు మించకపోతే పన్ను చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అయితే రూ.12.80లక్షల ఆదాయం వచ్చే ఉద్యోగులు మాత్రం రూ.60వేల దాకా పన్ను చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇలా ఝలక్ ఇచ్చారని పేర్కొన్నారు. ఓ ఉద్యోగి వార్షిక జీతం 12.80లక్షలు అనుకుంటే అతను రిబేట్ పరిధిలోకి రాడన్నారు. వేతనం నుంచి రూ.75వేల స్టాండర్డ్ డిడక్షన్ తీసివేయగా రూ.12.05లక్షల స్లాబు మేరకు టాక్సులు తప్పవన్నారు. దీనిపై అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

4న రథసప్తమి వేడుకలు

పులిచెర్ల(కల్లూరు): మండలంలో దేవళంపేటలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి రథ సప్తమి వేడుకలు ఈనెల 4న మంగళవారం నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం స్వామి వారి అభిషేకం, 11గంటలకు గ్రామోత్సవం, చక్రస్నానం నిర్వహిస్తామని, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదానం చేయనున్నట్టు ఆలయ అర్చకులు కుమారాచార్యులు తెలిపారు.

ఎమ్మెల్యే పెద్దిరెడ్డిని కలసిన శ్రీదేవి


ఎమ్మెల్యే పెద్దిరెడ్డిని కలసిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి శ్రీదేవి రెడ్డి

రొంపిచెర్ల: పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి కమలాపురం శ్రీదేవిరెడ్డి ఆదివారం తిరుపతిలోని ఆయన స్వగృహంలో కలిశారు. తన భర్త కమలాపురం రవీంద్రనాథరెడ్డి వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని, రొంపిచెర్ల మండలంలో అధికార పార్టీ నాయకులు వేధింపులు ఎక్కువయ్యాయని తెలిపారు. కోర్టులో కేసు నడుస్తున్న భూమిలో రెవెన్యూ, పోలీసుల అధికారులతో కలసి రోడ్డు వేశారని చెప్పారు. అధికారులందరూ టీడీపీకి తొత్తులుగా పని చేస్తున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను వేధించిన టీడీపీ నాయకులకు సమాధానం చెప్పే రోజులు మళ్లీ వస్తాయని ఎవరూ భయ పడాల్సిన పని లేదని ఆయన ధైర్యం చెప్పారు. కార్యకర్తలకు తాము అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

ఆదర్శ ప్రాథమిక పాఠశాలల మంజూరుకు ప్రతిపాదనలు


ఆదర్శ ప్రాథమిక పాఠశాలగా ఎంపిక కానున్న రొంపిచెర్ల తెలుగు ప్రాథమిక పాఠశాల

రొంపిచెర్ల: మండలంలో ఎనిమిది ఆదర్శ ప్రాథమిక పాఠశాలల మంజూరుకు విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. గత ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతుల విద్యార్థులను ఉన్నత పాఠశాలలకు కలిపి విద్యాబోధన చేశారు. అయితే ప్రస్తుతం ఆ వ్యవస్థను, ప్రభుత్వం జీవో 117ను రద్దు చేసింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 60 మంది విద్యార్థులు ఉన్నత పాఠశాలలను అదర్శ ప్రాథమిక పాఠశాలలగా ఎంపిక చేయనున్నారు. దీనికి ఒక పాఠశాలకు ఐదుగురు ఉపాధ్యాయులను నియమించనున్నారు. దీనిలో భాగంగా మండలంలోని బండకిందపల్లె, బొమ్మయ్యగారిపల్లె, ఫజులుపేట, ఆర్‌సీపురం కాలనీ, రొంపిచెర్ల ఉర్దూ, తెలుగు, పెద్దమల్లెల, గానుగచింత ప్రాథమిక పాఠశాలలను అదర్శ ప్రాథమిక పాఠశాలలుగా ఎంపిక చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి జిల్లా ఉన్నాతాధికారులకు మండల విద్యాశాఖ అధికారులు పంపారు.

ఉత్సాహంగా దూడల పండుగ


కడతట్లపల్లెలో నిర్వహిస్తున్న దూడల పండుగ

బైరెడ్డిపల్లె: మండలంలోని కడతట్లపల్లెలో ఆదివారం దూడల పండుగ ప్రశాంతంగా ముగిసింది. మండలం నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి రైతులు దూడలను తీసుకువచ్చి పరుగుపందెంలో వదిలిపెట్టారు. యువకులు ఉల్లాసంగా..ఉత్సాహంగా దూడలను నిలువరించేందుకు పోటీ పడ్డారు. పరుగుపందెంలో గెలుపొందిన దూడలకు సంబంధించి వాటి యజమానులకు నిర్వాహకులు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. యువకులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో కడతట్లపల్లె జనసందోహంతో కిక్కిరిసింది.

అభ్యర్థులపై కేటుగాళ్ల వల

డబ్బులు పంపితే ఉద్యోగం గ్యారంటీ అంటూ మోసగాళ్లు ఆన్‌లైన్ వేదికగా రెచ్చిపోతున్నారు. నిరుద్యోగులకు ఉద్యోగం పేరిట వల వేసి దోచుకునే ప్రయత్నం చేస్తున్నారు. మాయమాటలతో నమ్మబలికి మోసాలకు పాల్పడుతున్నారు. రూ.50 వేలు ఇస్తే ఉద్యోగం గ్యారంటీ అంటూ అభ్యర్థులకు మరిన్ని ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. ఇప్పటికే కొంత మంది ఈ నేరగాళ్ల వలలో పడి డబ్బులు పంపారని దీనిపై అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు హెచ్చరించారు.

- మెడికల్ పోస్టుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్
- గత వారం ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల
- ఇదే అదునుగా రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
- జాబ్ గ్యారంటీ పేరుతో నగదు డిమాండ్


డీఎంహెచ్‌ఓ కార్యాలయం, చిత్తూరు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): గతేడాది జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ఎన్‌హెచ్‌ఎంలో పలు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ పోస్టుల దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. భర్తీ ప్రక్రియలో భాగంగా గతవారం ప్రొవిజనల్ మెరిట్ లిస్టును ప్రకటించారు. ఈ తరుణంలో అభ్యర్థులకు మెరిట్ ఆధారంగా పోస్టులకు తమకు వరిస్తాయని కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. ఇందుకు లక్షల్లో డబ్బులిచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నారు. అయితే ఇదే అదునుగా భావించి సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. వారం క్రితం ఆన్‌లైన్‌లో పెట్టిన ప్రొవిజనల్ మెరిట్‌లిస్టును అందిపుచ్చుకొని అభ్యర్థులను మోసగించేందుకు రంగంలోకి దిగారు. ఇది పెద్ద నెట్‌వర్క్‌గా తెలుస్తోంది.

ఆ ఒక్క నంబర్‌తోనే..

రెండు రోజుల క్రితం 8981491288 నంబర్ నుంచి వచ్చిన ఫోన్ కాల్ కలకలం సృష్టించింది. ఆ వ్యక్తి స్టాఫ్ నర్సు ఉద్యోగం ఇప్పిస్తామన్న డబ్బు డిమాండ్ చేశారు. ఆ నంబర్‌ను ట్రూకాల్‌లో పరిశోధిస్తే డి బాలాజీ అనే పేరు వస్తోంది. దీనిని కలెక్టర్ కూడా సీరియస్‌గా తీసుకున్నారు. ఇది మరవక ముందే మళ్లీ అదే నంబర్‌తో ఫోన్స్ కాల్స్ వస్తుండడం గమనార్హం.

సైబర్ నేరగాళ్ల మాటలు ఇలా..

నగరికి చెందిన జయకుమారి అనే అభ్యర్థికి సైబర్ నేరగాళ్లు శనివారం ఫోన్ చేసి మాటల్లోకి దింపే ప్రయత్నం చేశారు. అయితే ఆ వాయిస్ రికార్డులను జిల్లా వైద్య ఆరోగ్య అభ్యర్థులకు పంపారు. ఆ నేరగాడి సంభాషణ ఎలా ఉందో చూద్దాం.

హలో జయకుమారి యా. నేను డీఎంహెచ్‌ఓ ఆఫీసు నుంచి మాట్లాడుతున్నాను. మీరు స్టాఫ్‌నర్సు పోస్టుకు దరఖాస్తు చేసుకున్నారు కదా. నేను మీ కులం వాడినే. మీకు సపోర్ట్ చేద్దామని ప్రయత్నిస్తున్నా. ప్రొవిజనల్ మెరిట్ లిస్టులో మీ పేరు ఉంది చూసుకున్నారా. (లిస్టులో ఉన్న వివరాలను గుచ్చి గుచ్చి చెబుతాడు). పోటీ గట్టిగా ఉంది. ఈ ఉద్యోగం పర్మినెంట్ చేయిస్తాం. జీవితాంతం ఉద్యోగం చేసుకోవచ్చు. నెలకు రూ.40 వేల జీతం. ఈ విషయం బయట ఎక్కడా చెప్పకండి. మీకు ఉద్యోగం అవసరమనుకుంటే రూ.50వేలు ఇవ్వాల్సి ఉంటుంది. 5 నిమిషాల్లో రూ.25 వేలు ఇవ్వండి. తరువాత మిగతా రూ.25 వేలు ఇవ్వచ్చు. నేను చెప్పినట్టు వినండి. తొందరగా ఫోన్ పే, జీ పే ఓపెన్ చేయండి రూ.25వేలు పంపండి. లేకుంటే మీ వెనుక చాలా మంది ఉద్యోగం కావాలని డబ్బులు పంపేందుకు సిద్ధంగా ఉన్నారు. డబ్బులు పంపితే వెంటనే ఫైనల్ మెరిట్ లిస్టులో మీ పేరు ఉంటుంది. లిస్టు వచ్చాక ధైర్యంగా మా సార్ దగ్గరకు వెళ్లండి. పోస్టు గ్యారంటీ. తొందరగా డబ్బులు పంపండి. తర్వాత మెయిల్ ఐడీ పంపండి అంటూ నమ్మబలికారు. ఇప్పటికే చాలా మంది నుంచి రూ.25 వేల చొప్పున నొక్కేసినట్లు తెలుస్తోంది. కొంత మంది అనుమానంతో ఆ వాయిస్ రికార్డ్ చేసి అప్రమత్తమవుతున్నారు.

పోస్టుల భర్తీ.. దరఖాస్తు వివరాలు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ఎన్‌హెచ్‌ఎంలో పలు పోస్టులకు భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 23 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ మేరకు డిసెంబర్ 13వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. దీంతో మొత్తం 1,452 దరఖాస్తులు వచ్చాయి. పోస్టుల వారీగా చూస్తే ఫిజీషియన్ -1 పోస్టుకు గాను 02 దరఖాస్తులు వచ్చాయి. మెడికల్ ఆఫీసర్ 2కు గాను 26, డెంటిస్ట్ 1కి గాను 121, ఆడియోలజిస్ట్–1కి గాను 10 దరఖాస్తులు, స్పెషల్ ఎడ్యుకేటర్ -1కి గాను 25 దరఖాస్తులు, అప్తోమెట్రిస్ట్ -1కి గాను 3 దరఖాస్తులు, స్టాఫ్‌నర్సు -5కు గాను 780 దరఖాస్తులు, ల్యాబ్ టెక్నీషియన్ 2కు గాను 100 దరఖాస్తులు, ఫార్మసిస్టు -2కు గాను 153 దరఖాస్తులు, లాస్ట్ గ్రేడ్ సర్వీస్ 7 పోస్టులకు గాను 232 దరఖాస్తులు అందాయి.

ఇది పెద్ద నెట్‌వర్క్‌లా ఉంది

ఈ వ్యవహారం వైద్యశాఖకు సంబంధం లేదు. ఫోన్‌కాల్స్ వచ్చిన నంబరును పరిశీలిస్తే.. నార్త్ ఇండియన్‌ది. ఇది సైబర్ నేరగాళ్ల పనే. ఇది పెద్ద నెట్‌వర్క్‌లా ఉంది. ఆన్‌లైన్‌లో పెట్టిన ప్రొవిజన్ లిస్టులను తీసుకుని ఇలా చేస్తున్నారని తెలిసింది. అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాల్సిందే. నమ్మి మోసపోకండి. పోస్టుల భర్తీ పారదర్శకంగా జరుగుతుంది. జిల్లాలో కూడా తెలిసిన వ్యక్తులకు ఎవరైనా కూడా డబ్బులిస్తే ఉద్యోగం తీయిస్తామంటే నమ్మకండి.

–సుధారాణి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

అర్హులైన వికలాంగులకు పెన్షన్లు ప్లీజ్!


గులాబ్‌జాన్‌ను పరామర్శిస్తున్న దివ్యాంగుల సంఘం నాయకులు

రొంపిచెర్ల: అర్హులైన వికలాంగులకు ప్రభుత్వం పెన్షన్లు మంజూరు చేయాలని దివ్యాంగుల జిల్లా అధ్యక్షుడు ఇర్షాద్ డిమాండ్ చేశారు. స్థానిక శ్రీరాముల గుడివీధికి చెందిన గులాబ్‌జాన్ తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమైందని, ఆమె భర్త మాజిద్‌బాషా కూలిపనులతో కుటుంబాన్ని పోషిస్తున్నాడని తెలిపారు. అలాగే ముత్యాలమ్మవీధికి చెందిన రమాదేవి ఐదేళ్ల క్రితం భవన నిర్మాణ పనులకు కూలీగా వెళ్లి రెండవ అంతస్తు నుంచి కింద పడి మంచానికే పరిమితమైందన్నారు. వీరిద్దరూ రూ.15వేల పెన్షన్‌కు అర్హులైనప్పటికీ అధికారులు ఇప్పటివరకూ పెన్షన్ మంజూరు చేయలేదన్నారు. ఇకనైనా వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దివ్యాంగల సంఘం నాయకులు మహద్మాలీ, దిలీప్, ఆనందరాజ, అబ్దుల్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫిర్యాదుల స్వీకరణ

కుప్పం: మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదులు స్వీకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజల నుంచి సమస్యలపై కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఫిర్యాదులు స్వీకరిస్తారని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.